9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 6, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక అక్టోబర్, సోమవారం 30- నవంబర్ ఆదివారం 5, 2017



# నేను మీ ప్రాణవాయువుని..

**నాలాంటి ఓ ముప్ఫై మీటర్ల చెట్టు ఏడాదికి పాతిక కిలోల బొగ్గుపులుసు వాయువును పీల్చుకుంటుంది. ఓ కారు నలభై అయిదువేల కిలోమీటర్లు ప్రయాణించడం వల్ల ఏర్పడే కాలుష్యానికి అది సమానం. దుమ్మునూ ధూళినీ నా ఆకులు ఆకర్షిస్తాయి. దీంతో...మనిషి వూపిరితిత్తుల మీద కలుషితాల ఒత్తిడి తగ్గుతోంది. శ్వాస సంబంధమైన క్యాన్సర్ నుంచి ఏటా పది లక్షల మందిని, మా వృక్షాలే కాపాడతాయని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. ఇన్ని అవాంతరాల మధ్య కూడా... మనిషి ఎంతోకొంత స్వచ్ఛమైన గాలిని పీలుస్తున్నాడంటే అది మా పుణ్యమే. ప్రతి చెట్టూ ఏడాదికి దాదాపు మూడువేల కిలోల ప్రాణవాయువు నిస్తుంది.మనిషి ప్రతి ఊపిరిలో నేనున్నాను. ఆ మనిషేమో...నా ఊపిరి తీసే ప్రయత్నంలో ఉన్నాడు.**

భూమిపై ఎంతమంది సార్వభౌములు పుట్టలేదు గిట్టలేదూ ? కానీ, రహదారులకు ఇరువైపులా చెట్లు నాటించిన ఆశోక చక్రవర్తి పేరునే ఇప్పటికీ తలుచుకుంటాం. సాధారణ మహిళ తిమ్మమ్మ...మర్రి మొక్కను నాటిన పుణ్యానికే చరితార్థురాలైంది. జనం ఆమెను దేవతలా కొలుస్తున్నారు. అనంతపురం జిల్లాలోని సువిశాలమైన తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ రికార్డులకూ ఎక్కింది. కన్నడ దేశంలో సాలుమరద తిమ్మక్క వందల చెట్లను నాటిన పచ్చని తల్లి! ఆమెను వరించని అంతర్జాతీయ పురస్కారాలు లేవు. అమరత్వం అంటే చావు లేకపోవడం కాదు, మరణం తర్వాత జనం గుండెల్లో బతికుండటం.

మొక్కను నాటితే ప్రకృతికి మంచి జరుగుతుంది. గువ్వలూ కాకులూ గూళ్లు కట్టుకుంటాయి. చీమలూ దోమలూ పురుగూపుట్రా... చుట్టుపక్కల చేరిపోతాయి. మొత్తంగా, చెట్టును నమ్ముకుని బతికే జీవాల సంఖ్య ఐదొందల దాకా ఉంటుంది. అంటే, ఒక్క చెట్టును నాటితే ఐదొందల జీవాల్ని పోషించినట్టే. ఇవన్నీ పర్యావరణ పరిరక్షణలో వీర సైనికులే. చెట్టుమీది పక్షులన్నీ పొలాల్లోని చీడపీడల్ని తిని, రైతుకు అండగా నిలుస్తాయి. పంటకు రసాయన ఎరువుల అవసరాన్ని తగ్గిస్తాయి. దీనివల్ల దిగుబడి ఖర్చు తగ్గుతుంది. భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. పర్యావరణానికి రసాయనాల కీడు తప్పుతుంది. ఒక్కో చెట్టూ...గాలివానలకు కొట్టుకుపోకుండా ఏటా పాతిక కిలోల సారవంతమైన మట్టిని...కాపాడుతుంది. సారం తగ్గిపోతే, పంట తగ్గుతుంది. రైతు కుదేలైపోతాడు. ఏ ఆత్మహత్యో చేసుకుంటాడు. అప్పుల బాధతోనో, బాధ్యతల బరువుతోనో చెట్టుకు ఉరేసుకోడానికొచ్చే రైతుల్నిచూసిన ప్రతిసారీ గుండె తరుక్కుపోతోంది. 'అన్నా...రైతన్నా! వద్దన్నా...చావొద్దన్నా..' అంటూ చేయిపట్టుకుని ఆపాలనిపిస్తుంది.


మనిషి స్వార్థం కారణంగా ఏటా కొన్ని వేల చెట్లు నేల కూలుతున్నాయి. అడవులు అంతరించి పోతున్నాయి. దీంతో మేం మునుపట్లా చల్లగాలిని ఎరగా వేసి, మేఘాల్ని ఆకర్షించలేక పోతున్నాం. వర్షాల్ని కురిపించలేకపోతున్నాం. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. ఎక్కడ చూసినా కరవుకాటకాలే. ఊళ్లకు ఊళ్లు వలస వెళ్లిపోతున్నాయి. ఉన్న కొద్దిమందికి కూడా గొంతు తడుపుకోడానికి నీళ్లు లేవు. ఆమధ్య, ఓ చిన్నారి గుక్కెడు నీళ్లు అందక గొంతెండి చచ్చిపోయింది. ఎంత ఘోరం! పచ్చని చెట్లుంటే ఈ పరిస్థితి రాదు. ప్రతి చెట్టూ రోజుకు నాలుగువేల లీటర్ల నీటిని భూమిలోంచి తోడి మేఘాలకు అందిస్తుంది. వృక్ష సంతతేమో బాగా తగ్గిపోయింది. ఎంత కాలుష్యాన్నని పీల్చుకోగలం. దాదాపుగా చేతులెత్తేయాల్సిన పరిస్థితి. వివిధ కారణాలతో భూమికి రక్షణ కవచమై నిలిచిన ఓజోన్ పొరకు చిల్లులు పడ్డాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు ఆ గాయాలే. దసరాదాటి, దీపావళి నాటికి చలికి ముసుగుతీసి బయటకు రావడానికి పిల్లలు పెద్దలూ బద్ధకిస్తూ ఉండేవారు. అయితే ప్రస్తుతం ఎండవేడికి తట్టుకోలేక నానా అగచాట్లు పడుతున్నారు. విపరీతమైన వేడికి మంచు కరిగి సముద్రాల్లో చేరుతుంది. వరదలు పోటెత్తుతాయి. వూళ్లకు వూళ్లు కొట్టుకుపోతాయి. నా పరిసరాల్లో సంచరించే అమాయక మూగజీవాలూ ఆ విధ్వంసంలో కనుమరుగైపోతాయి. మొదట్లో ఎంత జీవ వైవిధ్యం ఉండేది. ఎన్ని రకాల జంతువులూ, ఎన్నెన్ని పక్షులూ. అవన్నీ నాచుట్టూ సందడి చేస్తుంటే పిల్లల కోడిలా మురిసిపోయేదాన్ని. అడవులతో పాటే జీవజాతులూ అంతరించిపోతున్నాయి. ప్రతి గంటకూ ఆరు జాతులు కనిపించకుండా పోతున్నాయట! ఒక జీవి మాయమైతే, దాన్నే నమ్ముకుని బతికే మరో జాతి సంక్షోభంలో పడుతుంది. దీంతో ప్రకృతిలో సమతుల్యం దెబ్బతింటోంది.

స్వార్థం ఉప్పునీటి దాహం లాంటిది. గొంతు తడుపుకున్నకొద్దీ దప్పిక పెరుగుతుందే కానీ, తగ్గదు. మనిషి ఉన్మాదాన్ని చూస్తుంటే, సృష్టిలోని చిట్టచివరి చెట్టును కూడా పొట్టన పెట్టుకునేట్టున్నాడు. అదే జరిగితే...అతడి ఉనికికే ప్రమాదం.

చెట్టు లేని ప్రపంచంలో... మనిషికి కూడా స్థానం లేదు. అది గుర్తుంచుకుంటేనే మనిషి మనుగడ ...

ఇట్లు
మీ వృక్షం

# ఐలయ్యకు ప్రభుత్వం భయపడుతోందా?



**హైదరాబాద్:** ఐలయ్యను గృహనిర్బంధం చేయాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది. ఆర్యవైశ్యులతో సమస్య తీరిపోయిందని, ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు మరీ ముఖ్యంగా రిలయన్స్‌లో బడుగు, బలహీనవర్గాలకు ఉద్యోగ అవకాశాలు (రిజర్వేషన్లు) కల్పించడంపై చర్చనిర్వహిస్తామని మీడియా ద్వారా ఐలయ్య ప్రకటించినా ఆర్యవైశ్యులను అడ్డంపెట్టుకొని ప్రభుత్వం ఆయన రాకను అడ్డుకుంటోందని బహుజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో రిలయన్స్ మాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా రేషన్‌షాపులు, ప్రజాపంపిణీ వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వామపక్షాలు ఇప్పటికే ఘోషిస్తున్నాయి. అంతేకాదు ఆహారభద్రతకు కూడా అవాంతరం వచ్చిపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భారత ఆహార గిడ్డంగి సంస్థలు నిరుపయోజనంగా మారతాయి. దీంతో వేలాది ఉద్యోగాలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురిస్తోంది. ఎప్పటినుంచో ఉన్న టాటా, బిర్లా సంస్థలను కాదని అడ్డదిడ్డంగా వ్యవహరిస్తూ భారతదేశాన్ని ఆక్రమించుకుంటోంది. దీనికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయి. దీనిలో భాగంగానే కంచె ఐలయ్య పర్యటనను అడ్డుకుంటున్నాయని, ఇది ప్రజాస్వామ్య, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని సామ్యవాదులు వాపోతున్నారు. బహుజనులంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని సామాజిక, హేతు, మార్క్సిస్టువాదులు పిలుపునిస్తున్నారు.

**కంచ ఐలయ్య ఇంటి వద్ద ఉద్రిక్తత**

నగరంలోని తార్నాకలోగల ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఇంటి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కంచ ఐలయ్య బృందం విజయవాడకు బయలుదేరింది. అయితే... ఈ బృందాన్ని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య అనుచరులకు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# తెదేపాకు రేవంత్‌రెడ్డి గుడ్‌బై



**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ:** కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తెదేపాకు రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో చేరనున్నారని కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆయన తెదేపాను వీడుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల రేవంత్ రెడ్డి వ్యవహారాన్ని సొంత పార్టీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. రేవంత్ వ్యవహారంపై పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో చర్చించేందుకు తెలంగాణ తెదేపా నేతలు ఇవాళ విజయవాడకు చేరుకున్నారు. వారితోపాటు రేవంత్ కూడా విజయవాడ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీకి, పార్టీ పదవులకు రాజీనామా చేస్తూ అధినేతకు లేఖ రాశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీని రేవంత్ కలిశారని.. ఆ పార్టీలో త్వరలో చేరనున్నారని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.

**లేఖ అందలేదు : చంద్రబాబు**

రేవంత్‌రెడ్డి రాజీనామా లేఖ తనకు అందలేదని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యవహారంపై చర్చించేందుకు పార్టీ తెలంగాణ నేతలతో చంద్రబాబు భేటీ కానున్నారు.



# కార్తీకమాసంలో 'కృష్ణా' విహారం

**రాజధాని వార్తలు - అమరావతి :** కార్తీకమాసం అనగానే పిల్లలకు పెద్దలకు ఆటవిడుపుగా ఉంటుంది. కార్తీక వనారాధనకు ఎక్కడకు వెళ్లాలా అని గంటల తరబడి చర్చించి, ప్రయాణానికి ప్రణాళికలు వేస్తారు. నగరాల్లో వనాలు తరిగిపోవడంతో నగరవాసులంతా బెంబేలెత్తుతున్నారు. అయితే పర్యాటక రంగ శాఖ, ప్రభుత్వం సంయుక్తంగా కృష్ణానదిలో బోట్ షికారుకు ఏర్పాటు చేశారు. అంతకుముందే ఇబ్రహీంపట్నం నుంచి కృష్ణానదిలో పడవ ప్రయాణంతో భవానీ ద్వీపాన్ని చేరుకునే వెసులుబాటు ఉంది. అయితే కార్తీక మాసం సందర్భంగా బోటు షికారుతోపాటు భోజన, ఇతర సౌకర్యాలను టూరిజం శాఖ కేటాయిస్తోంది. లక్షరీపాంటూన్, స్పీడ్, బంపర్, బనానా బోట్లు ఏర్పాటు చేసి పర్యాటకులను ప్రభుత్వం ఆహ్లాదపరుస్తోంది. 8 మంది సభ్యులు కల బృందానికి కృష్ణానదిలో రాత్రిపూట క్యాండిల్ లైట్ డిన్నర్‌ను కూడా ఏర్పాటు చేస్తోంది. ప్రతిరోజు సాయంత్రం కృష్ణానదికి హారతిఇవ్వడం భక్తులను ఆకర్షిస్తోంది. నీటిపై తేలియాడే బోట్లకోసం అమెరికా నుంచి ప్రత్యేక కలప తెప్పించామని ఏపీ టూరిజం తెలియచేసింది. ఘాట్‌లో ఏర్పాటు చేసిన అక్వేరియం, శంఖువుల మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



**ఏసీ వాటర్ బోట్**

రాష్ట్ర పర్యాటక శాఖ రూ. 90 లక్షలతో ఏసీ వాటర్ బస్సును భవానీ ద్వీపంలో త్వరలో నెలకొల్పనుంది. లక్నోలోని గోమతి నదిలో ఇప్పటికే విజయవంతంగా ఈ సర్వీసులు కొనసాగుతున్నాయని పర్యాటక శాఖ తెలిపింది. రెండు వైపులా సోఫా సీటింగ్ మధ్యలో గ్లాస్ టేబుల్‌తో ఉండే ఈ బోట్‌ను ఫైబర్‌గ్లాస్‌తో తయారు చేశారు. దీనిలో 30 మందికి ప్రయాణించే సౌకర్యం ఉంది. ఈ ఏసీ బోటులో కూర్చొని నది అందాలను తనివితీరా వీక్షించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కార్పొరేట్ సంస్థలు మీటింగ్‌లు, సమావేశాలు జరుపుకుంటానికి అనువుగా ఉంటుందని టూరిజం డైరెక్టర్ హిమాంశు శుక్లా తెలిపారు. డిసెంబరు 15 నాటికి ఈ బోటు పర్యాటకులు అందుబాటులోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

## 'సమాచార' పదవుల బరిలో
# హేమాహేమీలు



డి.వి.రావు



జాస్తి రాముడు

**రాజధాని వార్తలు - అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమాచార హక్కు కమిషనర్ల పోస్టుల కోసం ఇద్దరు హేమాహేమీలు పోటీలు పడుతున్నారు. సామాన్యుని చేతిలో బ్రహ్మాస్త్రమైన సమాచార హక్కును పరిరక్షించే బాధ్యత ఈ కమిషనర్లపై ఉంటుంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఒక ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు ఎనిమిది మంది కమిషనర్లుగా నాటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. అయితే రాజకీయాలకు అతీతంగా నియమింపబడాల్సిన సమాచార కమిషనర్లలో నలుగురు రాజకీయ ప్రాబల్యంతో, పునరావాసంలో భాగంగా నియమితులయ్యారని, వారిని తొలగించాలని గరీబ్‌గైడ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంధ సంస్థ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన దరిమిలా వారి నియామకం చెల్లదంటూ హైకోర్టు తీర్పు చెప్పగా, ఆ నలుగురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కూడా హైకోర్టు తీర్పును సమర్థించడంతో వారు రాజీనామా చేయకతప్పలేదు. ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత తొలిసారిగా నియమిస్తున్న సమాచార కమిషనర్ల పోస్టులకు అక్టోబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ నోటిఫికేషన్ జారీచేసింది. అయితే అందుకు తగిన అభ్యర్థులు దొరకకపోవడంతో ఈ గడువు తేదీని ఈ నెల 30వరకు పొడిగించారు.

**'ప్రధాన ' బరిలో జాస్తి, డాక్టర్ డి.వి.రావు**

సమాచార హక్కు ప్రధాన కమిషనర్ పోటీలో మాజీ డీజీపీ జాస్తి రాముడు, సుప్రీంకోర్టు న్యాయవాది,గరీబ్‌గైడ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.వి. రావు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. జాస్తి రాముడు డీజీపీగా ఉమ్మడి రాష్ట్రంలో పలు సేవలు అందించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ డి.వి.రావు ఉస్మానియాలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. సైబర్‌లా, సమాచార హక్కు చట్టానికి సంబంధించి సర్టిఫికేట్ కోర్సులు పూర్తి చేసి, దాదాపు 300 చారిత్రాత్మక కేసులను సమర్థవంతంగా వాదించడంతో పాటు, దేశంలో పెండింగ్‌లో ఉన్న మూడున్నర కోట్ల కేసులకు మోక్షం కలగాలంటే న్యాయవ్యవస్థ రోజుకు మూడు షిఫ్ట్‌ల పాటు పనిచేయాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్రలు నిర్వహించిన జాస్తి రాముడుకు గట్టి పోటీ ఇస్తున్నారు.

# 3 రోజులపాటు లండన్‌లో జగన్ పర్యటన



**హైదరాబాద్:** వైసీపీ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన కోసం శనివారం ఉదయం లండన్ వెళ్లనున్నారు. నవంబర్ ఆరోతేదీనుంచి ప్రారంభం కానున్న 'ప్రజా సంకల్పం' పాదయాత్ర దాదాపు ఎనిమిది నెలల పాటు కొనసాగనున్న విషయం తెలిసిందే. జగన్ పెద్ద కుమార్తె వైఎస్ హర్ష ప్రతిష్టాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విషయం విదితమే. పాదయాత్ర మొదలయ్యాక లండన్ వెళ్లేందుకు వీలుపడదు కాబట్టి జగన్ శనివారం బయలుదేరి కుమార్తె వద్దకు వెళ్లనున్నారు.

# జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్‌గా వైసీపీ అభ్యర్థి



**జగ్గయ్యపేట :** కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్‌గా వైసీపీ అభ్యర్థి ఇంటూరి రాజగోపాల్ ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శనివారం ఉదయం ఇంటూరి రాజగోపాల్‌తో మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 27 మంది కౌన్సిలర్లలో వైసీపీకి 16, టీడీపీకి 10, ఇతరులు ఒకటి ఉన్నారు. ఛైర్మన్ ఎన్నిక వాయిదా వేయాలని టీడీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అయితే ఎన్నిక వాయిదాకు ససేమిరా అనడంతో టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. కోరం ఉండటంతో ఇంటూరి రాజగోపాల్ ప్రమాణం చేశారు. టీడీపీ నేతల దౌర్జన్యంతో ఛైర్మన్ ఎన్నిక నిన్న వాయిదా పడిన విషయం తెలిసిందే. ఓ వైపు ప్రలోభాలు, మరోవైపు బెదిరింపులకు టీడీపీ పాల్పడినా...వైసీపీ కౌన్సిలర్లు ఏమాత్రం లెక్కచేయలేదు. దీంతో నాటకీయ పరిణామాల మధ్య జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది.






రాజధాని వార్తలు
కలం

## వనభోజానాల కెళదాం...

కార్తీక మాసం అనగానే పగటి వేడి తగ్గి రాత్రిపూట చంద్రకాంతిని ప్రసరిస్తూ ఉండేది. అయితే ఈ ఏడాది ఇప్పటికీ ఎండ తగ్గకుండా ప్రకృతి ప్రకోపిస్తోంది. రోడ్డువిస్తరణ, భవననిర్మాణాల పేరుతో ప్రభుత్వాలు, సంస్థలు పచ్చని చెట్లు నరికివేయడమే కారణం అని చెప్పక తప్పదు. ఈ ఏడాది దసరా, దీపావళి మాదిరిగా కార్తీక వనభోజనాలు కూడా కళతప్పాయని చెప్పకతప్పదు.ఒకే ఏడాదిలో పెద్దనోట్లరద్దు, జీఎస్టీ దేశప్రజలకు శరాఘాతంగా తగలడమే ఇందుకు కారణం. ఏది ఏమైనా ఈ ఏడాది పిల్లాపాపలు, స్నేహితులతో హోటళ్లకు వెళ్లి,కేంద్ర, రాష్ట్ర జీఎస్టీల బారిన పడకుండా మన ఇంటి వంటతో వనభోజనాలు చేసి పిల్లలకు ఈ మాస ప్రాశస్త్యాన్ని, వనాల ఆవశ్యకతను, మొక్కల పెంపకాన్ని పిల్లలకు తెలపవలసిన అవసరం ఎంతైనా ఉంది. విదేశీయులు ప్రతి వారాంతాం తమతమ స్నేహితులతో పిక్నిక్‌లకు వెళుతుంటారు గాని, భారతీయులు మాత్రం ఈ మాసంలో స్నేహితులు, సన్నిహితులు, తోటి ఉద్యోగస్తులతో తప్పనిసరిగా వనభోజనాలకు వెళ్లి ఆడి, పాడి ఆనందోత్సవాల మధ్య ఇంటికి చేరుకుంటారు. రోజూ ఒకే విధమైన జీవనంతో బోర్ కొడుతుందనే ఉద్దేశంతోనూ, సహవాసులందరిలో సుహృద్భావన కలిగించాలని బహుశా మన పెద్దలు ఈ వెసులుబాటు కలిగించి ఉంటారు. అప్పట్లో వనాలను సంరక్షించాలన్న ధ్యాసతో, రకరకాలైన చెట్లు మానవుని ఆయుష్షు పెంచుతాయని కూడా మన పూర్వీకులు వీటిని ప్రారంభించి ఉంటారు. మరీ ముఖ్యంగా ఉసిరి చెట్టు క్రింద వీటిని ఏర్పాటు చేసేవారు. మహిళలంతా చెట్లు కింద దేవీ స్తుతి, వనలక్ష్మీ పాటలు పాడి పసందైన శాఖాహార భోజనం ఆరగించేవారు.వనాలతో మంచి గాలిని, దీంతో ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ, చెట్ల ఫలాలను పొందటం ఆ హాయి... ఈ తరానికి తెలియకుండా పోతోంది. ఎంత ధనం పోసినా, ఎన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నా పచ్చటి పర్యావరణం ముందు అవన్నీ బలాదూరే అని తెలియచేసే వారు కూడా లేకపోవడం ప్రస్తుత తరం దురదృష్టం. ఎంత శారీరకంగా ఎంత శ్రమ పడ్డా, మానసికంగా హాయిగా ఉండేవారు. నిజం చెప్పాలంటే ప్రకృతితో సహజీవనం చేసి, ఆయురారోగ్య, ఐశ్వర్యాలను పొందేవారు.

అయితే ప్రస్తుతం వనం అన్నది లేదు. ఇంకా చెప్పాలంటే చెట్లు చేమలు అన్నీ నరికివేసి అందమైన బహుళ అంతస్థులు నిర్మించారు. ఇదే అభివృద్ధి అని చెప్పేవాళ్లు కూడా చాలా మంది ఉన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేసే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. అంతేకాదు వనభోజనాల దీని మౌలిక సూత్రాన్ని కూడా స్వార్థరాజకీయ నాయకులు తమకోసం వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వన భోజనాలు కాస్త.. కులభోజనాలుగా మారాయి. సహవాసులతో వెళ్లవలసిన కార్యక్రమం కాస్తా కులపోళ్లతో వెళ్ల వలసి వస్తోంది. కుల, మతతత్వాలను తగ్గించే ఈ ప్రక్రియ వాటిని ప్రోత్సహించే దిశలో మరింత పెరుగుతోంది. ఎక్కడ పడితే అక్కడ కులభోజనాలు జరుగుతున్నాయి. కులాల్లోని గొప్పొళ్లు విడిదిని ఏర్పాటు చేసి (వనాలు లేనందున) ఎన్నికల్లో వాడుకుంటున్నారు. లేదా హాజరైనవారి సంఖ్య బట్టి బలాన్ని చూసి రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. కులాలు, మతాల ప్రభావాన్ని పెంచుతూ, వారిలో కక్ష్యలు, కార్పణ్యాలు ఎగదోసి తమ పబ్బం గడుపుకుంటున్నారు. వాళ్లు రాజకీయంగా ముందున్నారంటే, వీళ్లు ముందున్నారని కాకి లెక్కలు చెబుతూ జాతిగా ఎదగాల్సిన వారిని కులాలు మతాలుగా విడదీస్తున్నారు. ఫంక్షన్ హాళ్లల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, మాంసాహార విందుతోనూ, మగవారు మద్యంతోనూ ఈ కార్యక్రమాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. నిజానికి ఈ పద్ధతి నిషిద్ధం. ఒక 20 ఏళ్ల క్రితం ఈ పద్ధతి లేదు. సహోద్యోగులు, కాలనీ వాసులు, సహచరులతో ఈ కార్యక్రమం జరుపుకునే వారు. మనిషిని మనిషిగా గుర్తించడానికే ఏ పండుగలైనా.. అంతేకాని కులం, మతం, ప్రాంతంగా విడదీయటం భారతీయతకు చేటని గుర్తించాలి. వనభోజనాలను ఆదరించి... కులభోజనాలను నిరసించాలి...

చేయకుండానే చేశాననే వాడు అధముడు.
కొద్దిగా చేసి కొండంత చేశానని
చెప్పేవాడు గర్వపోతు.
ఎంతో చేసి కొంచెమే చేశానని
చెప్పేవాడు సజ్జనుడు.

# రాజధానిలో పెరిగిన దొంగతనాలు

## రౌడీషీటర్లపై కొరవడిన నిఘా



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** రాజధానిలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నిఘా వ్యవస్థ నిద్రావస్థలోకి జారుకుంది. అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించిన నాటి నుంచి ఈ ప్రాంతంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుక్షణం అప్రమత్తంగాఉంటూ ప్రజాజీవనానికి ఇబ్బంది లేని రీతిలో భద్రత ఇచ్చారు. అయితే ఆరంభంలో పూర్తి స్థాయి భద్రత ఏర్పాటు చేసి చీమచిటుక్కుమన్నా తెలుసుకునే విధంగా చర్యలు చేపట్టారు. అనుమానం వచ్చిన ప్రతి వ్యక్తిని విచారించి పంపించేవారు. కొన్ని సందర్భాల్లో రాజధాని వాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత చవిచూడాల్సి వచ్చింది. ఐతే ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, ఇలా అంచెలంచెల భద్రత కల్పించి తమదైన శైలిలో రాజధాని భద్రతపై నిర్ణయాలు తీసుకున్నారు. 29 గ్రామాల్లో పోలీస్ కవాతులు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఔట్ పోస్టు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. పంట పొలాల్లోకి పనులకు వెళ్లే వారు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఒకానొక దశలో 'గ్రామాల్లో తిరగనివ్వరా' అంటూ గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన సందర్భాలు కొకోల్లలు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం ఏర్పాటు చేసిన అనంతరం సీఆర్డీఏ ప్రాంతంపైన పోలీసులు ప్రధాన దృష్టి సారించి వివాదాస్పద గ్రామాల్లో భద్రత పెంచారు.

**మారిన పరిస్థితి ....**

అయితే రాజధానిలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. దొంగలు, చైన్‌స్నాచర్లు చెలరేగిపోతున్నారు. మద్యం బాబుల ఆగడాలకు అడ్డూ , అదుపు లేకుండా పోయింది. పగలు గ్రామాల్లో సంచారం చేసి, రాత్రి దొంగతనాలకు పథకాలు రచించే ముఠాలు అధికమయ్యాయి. పేకాట, గంజాయిలాంటి వ్యసనాలకు యువత బానిసలవుతున్నారు.

**రౌడీషీటర్లపై నిఘా ఏది?**

రాజధాని ప్రాంతంలో రౌడీషీటర్ల కార్యకలపాలపై నిఘా పూర్తిగా కొరవడింది. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వారానికి ఒకసారి రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉన్నా నెలలో ఒక్కసారి కూడా అలాంటివి జరిగిన దాఖలాలు కనిపించకపోవడం విశేషం. పైగా ఏ వ్యక్తి ఎక్కడ ఉంటున్నాడో ఏం పని చేస్తున్నాడో అసలు ఆ స్టేషన్ పరిధిలో ఉంటున్నాలో కూడా సమాచారం లేని దుస్థితి, రైడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వారి రికార్డుల గురించి పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సైతం అంతంత మాత్రంగానే ఆసక్తి చూపడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. గ్రామాల్లో నిత్యం ప్రజలతో మమేక మవ్వాల్సిన పోలీసులు అసలు గ్రామాల వైపు చూడటమే మానేశారు. ఎప్పుడైతే గ్రామాల్లో పోలీసులు పర్యవేక్షణ మరిచారో అసాంఘిక శక్తులు పేట్రేగి పోవడం ప్రారంభించాయి. సాక్షాత్తూ వెలగపూడి సచివాలయం సమీపంలో రాత్రి సమయంలో దొంగలు ఓ వ్యక్తిపై ప్రతాపం చూపించి అందినకాడికి దోచుకుపోయన సంఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి రాకపోకలు సాగించే సమయంలో తప్ప ఇతర సమయాల్లో పోలీసులు ఆ ప్రాంతంలో ఉండకపోవడం దొంగలకు కలిసొచ్చే అంశంగా మారింది. అంతా నిర్మానుష్య ప్రాంతాలు కావడం గ్రామాలు గ్రామాలకు నడుమ బీడు భూములు ఉండటం ప్రయాణీకులకు కొంత ఆందోళన కలిగించే అంశంగా మారింది.

**మరుగున పడ్డ కమిషనరేట్.....**

రాజధాని ప్రాంతంలో కమిషనరేట్ ఏర్పాటు చేయాలనే అంశం పూర్తిగా మరుగున పడింది. గుంటూరు విజయవాడలను కలుపుతూ సీఆర్డీఏ ప్రాంతాన్ని జనాభా ప్రాతిపదికన పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఊహలకే పరిమితమైంది. రాజధాని ప్రాంతం కొంత భాగం అర్బన్ మరికొంత భాగం రూరల్ పరిధిలో ఉండటం పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉంటున్న నివాసం అర్బన్ పరిధి, సచివాలయం రూరల్ పరిధి, ఇలా భాగాలుగా ఉండటం కొంత ఇబ్బందే.అయితే ఏఎస్పీ స్థాయి అధికారిని రాజధాని ప్రాంతంలో భద్రత నిమిత్తం నియమించినా పూర్తి స్థాయిలో పోలీసింగ్ జరగడం లేదు. ఇదే క్రమంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై నేటికీ సరైన పర్యవేక్షణ కనబరిచిన దాఖలాలు కనిపించికపోవడం గమనార్హం. గంజాయి అమ్మకాలు పెరుగుతున్నప్పటికీ మూలాలను వెతికి నిరోధించే ప్రక్రియ చేపట్టకపోవడం శోచనీయం. ముఖ్యమంత్రి ఉన్న గ్రామంలోనే యథేచ్ఛగా అగంతకులు సంచరిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యహరించడం గమనించదగ్గ విషయం. ఏదైనా అనుకోని సంఘటన జరగక ముందే ప్రభుత్వం, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాజధాని వాసులు కోరుతున్నారు.

# దివ్య ఖురాన్ కంఠస్థ పోటీలు

**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆధ్యాత్మికత, క్రమశిక్షణను పెంపొందించేందుకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ ఎం.డి. దావూద్ తెలిపారు. ఈ పోటీలకు 12 సంవత్సరాల లోపు బాలబాలికలే అర్హులన్నారు. ఆసక్తి కలవారు www.ufqs.org వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను నవంబర్ 20 లోపు డౌన్‌లోడ్ చేసుకుని అందజేయాలన్నారు. రాష్ట్రంలోని 10 జిల్లాలలో సెమీఫైనల్స్ నిర్వహించిన తరువాత విజయవాడ ఆటోనగర్‌లోని ఆటోమోబైల్ టెక్నీషియన్ అసోషిమేషన్ హాల్లో ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు హబీబ్ రెహ్మాన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.




గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న యూఎఫ్ క్యూఎస్ చైర్మన్ ఎండీ దావూద్, సాధిక్ తదితరులు

## త్వరలో 'టై' ఏర్పాటు

**రాజధాని వార్తలు ప్రతినిధి- అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ చాప్టర్ (టై)ను త్వరలో ప్రారంభించనుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేయటం, సంపద సృష్టించి సమాజానికి ఇవ్వటం కోసం అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో టై ప్రపంప ప్రఖ్యాతిగాంచింది. వ్యవస్థాపక సభ్యులు శ్రీ సిటీ చైర్మన్ శ్రీని రాజు, ప్రభుత్వ ఐ.టి. సలహాదారు జె.వి. చౌదరి, ఇండియా పార్ట్‌నర్స్ ఎం.డి. రమేష్ బైరిపనేని, జెర్దావు స్టీల్ ఎం.డి శ్రీధర్ కృష్ణమూర్తి, సురేష్ చిట్టూరి, సతీష్ ఆంధ్ర, పూర్ణిమ కాంబ్లే, వోల్వో చైర్మన్ మురళీ చుక్కపట్నం ఈ అమరావతి టైచాప్టర్‌కు ఛాంపియన్లుగా వ్యవహరించనున్నారని బోర్డు ట్రస్టీలు ఒక ప్రకటనలో తెలిపారు. టై ద్వారా అమరావతి చాప్టర్‌లో 30 మంది చార్టర్ మెంబర్లు, దాదాపు 500 మంది అసోసియేట్ మెంబర్లు , విద్యార్థిమెంబర్లు వివిధ కాలేజీలనుండి చేరనున్నారు. అనుదీప్ చాప్రా టై అమరావతి చాప్టర్‌లో పూర్తికాలపు పని చేయనున్నారు. రాబోయే తరానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం, ఇండస్ట్రీతో కలిసి తయారుచేయటంలో టై అమరావతి చాప్టర్ ఎంతో ఉపయోగపడనుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ఐటీలో మహిళా శక్తి తగ్గుముఖం

### అధ్యయనంలో వెల్లడి

**ముంబై :** భారత ఐటీ పరిశ్రమలో మహిళల భాగస్వామ్యం రాన్రాను తగ్గుతూ వస్తోంది. అన్ని స్థాయిల్లోని ఉద్యోగాల్లో మహిళాల భగస్వామ్యం 34 శాతంగానే ఉంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో మహిళల భాగస్వామ్యం కేవలం 26 శాతంగానే ఉన్నట్లు బిలాంగ్ అధ్యయనం వెల్లడించింది. సుమారు 50మంది ఉద్యోగులకు పై బడిన ఐటీ కంపెనీల్లో వివిధ స్థాయిల్లో పని చేసే మహిళ ఉద్యోగులు మూడు లక్షల మంది నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా నివేదికను రూపొందించారు. ఈ క్రమంలో సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్, గణిత రంగాల పట్ల మహిళల ఆసక్తి సన్నగిల్లుతున్నట్లు గుర్తించారు. టెకీల కెరియర్లో పదోన్నతుల సరళినీ పరిశీలించారు. ఆరు సంవత్సరాల అనుభవం గడించిన పురుషులు ఆయా కంపెనీల్లో మేనేజరు స్థాయికి పదోన్నతి పొందగలుగుతున్నారని నివేదిక తెలిపింది. అదే మహిళలు అయితే ఎనిమిది సంవత్సరాలు పని చేస్తే కానీ మేనేజరుగా పదోన్నతి పొందలేక పోతున్నారని తెలిపింది. అయితే, ఎనిమిది సంవత్సరాలు పని చేసిన తరువాత ఇంజనీరింగ్ బాధ్యతల నుంచి 45 శాతం మంది మహిళలు తప్పుకుంటున్నారని నివేదిక తెలిపింది. ప్రత్యామ్నాయంగా మార్కెటింగ్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, కన్సల్టింగ్ విభాగాలను ఎంచుకుంటున్నారని వివరించింది.

## సోనియాగాంధీకి అస్వస్థత



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. సిమ్లా పర్యటనలో ఉన్న ఆమెకు కడుపు నొప్పి రావడంతో ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి చైర్మన్ డి.ఎస్.రానా మాట్లాడుతూ 70 ఏళ్ల సోనియా కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించామని, తమ పర్యవేక్షణలో ఉన్నారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆమెను ఆస్పత్రికి తీసుకువచ్చారు'అని వివరించారు. సిమ్లా నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## రాజధానిలో మెరుగైన విద్యుత్ వ్యవస్థ

### ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో మెరుగైన విద్యుత్ వ్యవస్థ కోసం రూ.16,349 కోట్లతో పనులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడంతో పాటు, భూగర్భ విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ప్రారంభమైన వర్క్‌షాపులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ... రాజధాని ప్రాంతంలో 400 కేవీ సబ్‌స్టేషన్లు మూడు, 220 కేవీ 17, 33 కేవీ 165 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కృష్ణానదీ ప్రాంతంలో లైన్ల మార్పిడికి సింగపూర్ ప్రతినిధుల సూచనలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సింగపూర్ ప్రభుత్వ విద్యుత్ రంగ నిపుణులు లిన్ యూసెస్, యో యేక్‌సెంగ్, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ సుబ్రహ్మణ్యం పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంకులకు 2.11 లక్షల కోట్ల మూలధనం

### దశలవారీగా అందిస్తాం : జైట్లీ



**న్యూఢిల్లీ :** నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ)తో సతమతమవుతున్న బ్యాంకులకు రెండేళ్లపాటు 2.11లక్షల కోట్ల రూపాయలను మూలధనంగా అందజేస్తామని కేంద్రం ప్రకటించింది. ఇందులో 1.35 లక్షల కోట్ల రూపాయలను పున:పెట్టుబడుల బాండ్లకింద ఇస్తామని, మిగిలిన 70 వేల కోట్ల రూపాయలను బడ్జెటరీ మద్దతుగా అందజేస్తామని ఆర్థిక విభాగపు కార్యదర్శి రాజీవ్ శర్మ తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్థిక విభాగపు కార్యదర్శి రాజీవ్ శర్మ విలేకరులతో మాట్లాడారు. వచ్చే కొద్ది నెలల్లో ప్రకటించనున్న బ్యాంక్ సంస్కరణ విధానంలో బ్యాంకులకు దశలవారీగా అందించే మూలపెట్టుబడులను ఏ రకంగా అందించేదీ తెలియజేస్తామని జైట్లీ తెలిపారు. బాండ్ల విషయం ఏవిధంగా ఉంటుందో ప్రజలకు త్వరలోనే వెల్లడిస్తామని ఆయన చెప్పారు. 2015 మార్చి నాటికి బ్యాంకుల ఎన్‌పీఏలు 2.75 లక్షల కోట్లకు చేరుకున్నాయని, 2017కు అని 7.33 లక్షల కోట్లకు పెరిగాయి. ఇంద్రాధనుష్ పథకం కింద బ్యాంకులు 18 వేల కోట్ల రూపాయలు పొందుతాయని ఈయన పేర్కొన్నారు.

**ఆర్థికరంగం శక్తిమంతం**

సూక్ష్మ ఆర్థిక నిబంధనలతో దేశ ఆర్థిక వ్యవస్థ శక్తిమంతంగా ఉందని జైట్లీ వెల్లడించారు. కొన్ని అంశాల్లో మరింత ప్రోత్సాహం అవసరమని, జీడీపీ ఆధారంగా ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం అంచనా వేస్తోందని ఆయన తెలిపారు. ఆర్థికరంగంపై ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించిదని, దీర్ఘకాలిక జీడీపీ వృద్ధిరేటుపై దృష్టిపెట్టామని ఆయన చెప్పారు.

## అమరావతిలో ఏపీ హెచ్‌ఆర్‌సీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ




**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ (ఏపీహెచ్‌ఆర్‌సీ) ఇక నుంచి రాజధాని అమరావతి కేంద్రంగా పని చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దీని హెడ్ క్వార్టర్ అమరావతికి మారింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి (పొలిటికల్) ఎన్ శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం 2014లో ఏపీహెచ్‌ఆర్‌సీ 10వ షెడ్యూల్‌లో ఉంది. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే హెచ్‌ఆర్‌సీ ఉండటంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయాలంటే హైదరాబాద్ వెళ్లటం పెద్ద కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వం హెచ్ క్వార్టర్‌ను రాష్ట్రానికి మార్చటంతోపాటు అమరావతిలోనే దీనిని ఏర్పాటు చేసింది.

## కనకదుర్గ ఫ్లైవోవర్ పనులు వేగవంతం చేయండి

### కలెక్టర్ బి. లక్ష్మీకాంతం



**రాజధాని వార్తలు ప్రతినిధి- విజయవాడ :** డిసెంబర్ నెలాఖరుకు కనకదుర్గ ఫ్లైవోవర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ బి. లక్ష్మీకాంతం అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.రెవెన్యూ,పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్ జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ అధికారులతో కలసి ప్రత్యేక బస్సులో పర్యటించి పనుల ప్రగతిని పరిశీలించారు. తొలుత నగరంలోని కనకదుర్గ ఫ్లై వోవర్ పనులు పరిశీలించి పనుల పురోగతిపై నేషనల్ హైవే ఎస్‌ఈ జాన్ మోషేను వివరాలడిగి తెలుసుకున్నారు.

జనవరి 1వ తేదీ నుండి ట్రాఫిక్‌ను అనుమతించడం జరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని డిసెంబర్ నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే అదనపు కూలీలను నియమించి వేగంగా పూర్తి చేయాలన్నారు. స్పాన్స్, వింగ్స్‌లను అమర్చేందుకు వీలుగా అవసరమైన టెక్నాలజీ మిషన్లను వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఏలూరు రోడ్డు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు జరుగుతున్న గ్రీనరీ పనులను పరిశీలించి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అక్కడే జరుగుతున్న ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. బందరు, ఏలూరు, రైవస్ కాలువల ఇరవైపుల గ్రీనరీని అభివృద్ధి చేయాలన్నారు. ప్రతివారం పనుల ప్రగతిని సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని తెలిపారు. పర్యటనలో జె.సి.-2 పి. బాబురావు, ఆర్డీవో ఎస్.హరీష్, మున్సిపల్ కమిషనర్ జె. నివాస్, ఆడిషనల్ డీసీపీలు నాగరాజు, బ్రహ్మారెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ ఈ శేషుకుమార్, డీఎఫ్‌వో బెనర్జి తదితరులు పాల్గొన్నారు.

## మన కోసం


| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

మ్యారేజీ లింగ్స్

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |


## కేసులు పెడితే చూస్తూ ఊరుకోం

- నారాయణ విద్యాసంస్థల నుంచి విడిపోతున్నాం
- శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మా బొపన్న

**నెల్లూరు :** ఇష్టానుసారం శ్రీ చైతన్య పై కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని శ్రీ చైతన్య విద్యాంసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మా బొపన్న తెలిపారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలపై మండి పడ్డారు. నెల్లూరులో ఆర్ఎంఓ సరిగా లేనందున ఇద్దరు విద్యార్థులు హైదరాబాద్‌లోని తమ సంస్థలో నారాయణ నుంచి చేరారని చెప్పారు. రాజకీయ ఉద్దేశంతో తమపై బురద చల్లాలని చూస్తే ఊరుకోమని, కిడ్నాప్ చేయాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు." 31 సంవత్సరాల నుంచి నారాయణ, శ్రీ చైతన్య కలిసి ప్రయాణం చేస్తున్నాయి. నారాయణ సంస్థలు అక్కడ మాటలు ఇక్కడ మాటలు అక్కడ చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు." అని ఆ సంస్థలపై మండిపడ్డారు. రాజకీయ పరపతితో శ్రీ చైతన్య సంస్థలను అణగతొక్కాలని నారాయణ విద్యా సంస్థలు కంకణం కట్టుకున్నాయన్నారు. నారాయణ సంస్థల నుంచి దాదాపు 30 మంది శ్రీ చైతన్యలోకి వచ్చారన్నారు. ఇంత కాలం ఓర్పుతో కలిసి మెలసి ఉన్నామని ఇక ఉండలేమని స్పష్టం చేశారు. రాజకీయ ఉద్దేశం కక్షతో తమపై నిందలు వేస్తున్నారని, కిడ్నాప్ చేయాల్సిన అవసరం తమకు లేదని సుష్మా బొపన్న తెలిపారు.

## కొండపల్లి బొమ్మల రూపకల్పన పోటీకి దరఖాస్తుల స్వీకరణ

**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** కొండపల్లి ఎడ్లబండి, మరబొమ్మల డిజైన్ల రూపకల్పన కోసం పోటీ నిర్వహిస్తున్నమని, ఔత్సాహిక... ఇంజనీర్లు, వడ్రంగులు డిసెంబర్ 31 లోగా దరఖాస్తులు పంపాలని ప్రభుత్వ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకున్న డిజైన్లను జనవరి మొదటి వారంలో ప్రదర్శనకు ఉంచుతామని, రెండో వారంలో ఫలితాలను ప్రకటిస్తామని వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మెమోంటోల ఎంపికకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాల కోసం 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీ.ఈవోవీ.ఇన్' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## రాయపూడిలో అంగన్‌వాడీ సెంటర్ సందర్శించిన గల్లా రమాదేవి

**రాజధాని వార్తలు ప్రతినిధి- రాయపూడి :** నవ్యాంధ్ర రాజధాని ప్రాంతమైన రాయపూడి గ్రామంలో అంగన్‌వాడీ ఎస్సీ సెంటర్‌లో, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ సోదరి డాక్టర్ రమాదేవి ఎన్‌జీవో సభ్యులతో కలిసి అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి అక్కడకు వచ్చే బాలింతలను, గర్భిణీలను ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సకాలంలో అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా సుఖ జీవన్‌బాబు,ఎన్‌జీవోలు కల్పన, స్నేహలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# ధీర వనిత


## ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా



రాచరికవ్యవస్థ, ఆ తరువాత బ్రిటీషు వలస పాలనావ్యవస్థ దేశ ప్రజలలో అత్యధికులు పేదరికంలో ఉండటానికి కారణమైంది. ఈ కారణంగానే స్వతంత్ర భారత సంగ్రామంలో పాల్గొన్న రాజకీయ పక్షాలు సమాజంలో ధనికులు పేదల మధ్య అంతరాన్ని నిర్మూలించటానికి కృషి చేయాలని అనుకున్నారు. స్వాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ కూడా సహజంగా అదే మార్గాన్ని అనుసరించింది. ఈ కారణంగా రాజకీయ పార్టీలు కమ్యూనిస్టులు, సోషలిస్టు భావాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. స్వతంత్ర్యం తరువాత మన ప్రజాస్వామ్య వ్యవస్థను ఎన్నుకున్న రాజకీయ నాయకులు మన రాజ్యాంగాన్ని రూపుదిద్దేటప్పుడు కూడా సమాజంలోని అట్టడుగులో ఉన్న వారి పరిస్థితులను మెరుగు చేయడానికి అవసరమైన మార్గాలను రూపొందించారు. రాజ్యాంగాన్ని రూపొందించటంలో ప్రధాన పాత్ర వహించిన డా. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రాజ్యంగ రక్షణ కల్పించటం పై ప్రత్యేక శ్రద్ధ వహించారు. అయితే శతాబ్ద కాలంలో ఉన్న వ్యవస్థ రాజ్యాంగంతో మారిపోదు. రాజ్యాంగంలో ఉన్నటువంటి వాటిని అమలుపరచటానికి దృఢమైన సంకల్పం ఉంటేనే అదిసాధ్యమవుతుంది. ఇందిరాగాంధీలో అటువంటి సంకల్పం ఉండటం అధికారంలో ఉన్నపుడు ఆమె అనుసరించిన మార్గమే స్పష్టం చేస్తుంది. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు ఉపయోగం కలగటానికి రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు ఆమె తీసుకున్నారు. అఖిల భారత



సర్వీసులలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు రిజర్వేషన్లు అమలు చేయటమే కాదు రాజకీయరంగంలో వెనుక బడిన తరగతుల వారికి అవకాశం కల్పించటానికి చర్యలు తీసుకున్నారు. వలసపాలనలో చితికిన దేశాన్ని అన్నిరంగాలలో మెదట హరితవిప్లవం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించారు. వివిధ రంగాలలో దేశాన్ని స్వయం సమృద్ధి సాధించటానికి వైజ్ఞానిక పరిశోధనలకు పెద్ద పీట వేశారు. సరిహద్దులో సమస్యలను సృష్టిస్తున్న పాకిస్థాన్‌ను యుద్ధంలో మట్టి కరిపించటమేకాక, తూర్పు పాకిస్థాన్‌ను బంగ్లాదేశ్



అవతరణకు సహకరించారు. పేదరిక నిర్మూలన బడుగు బలహీన వర్గాలలో వెనుకబడిన వారికి పరిపాలనలో భాగస్వామ్యం భారతదేశ రాజకీయాలలో కల్పించే మార్గాన్ని ఇందిరాగాంధీ ఎన్నుకున్నారు. పేదరిక నిర్మూలనలో ఇందిరాగాంధీ విధానాలు కేవలం జనాకర్ష విదానాలే అని ఆమె బతికి ఉండగానే కాదు ఇప్పుడు కూడా విమర్శిస్తున్నారు. జనాకర్ష నినాదాలుగా ఆమె నిర్ణయాలను విశితంగా విమర్శించినవారు నేడు అదే మార్గాన్ని అనుసరించటం గమనించవలసిన అంశం. కాంగ్రెస్ హయాంలో అంతర్జాతీయంగా దేశానికి గొప్ప గుర్తింపు ఉండేది.

# కూరగాయల మంట

### అధిక వర్షాలతో తోటలు ధ్వంసం



**కర్నూలు :** అధిక వర్షాలకు తోటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. నెల రోజుల్లో ధరలు రెట్టింపు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఎప్పుడూ కిలో రూ.10 నుంచి రూ.30లకు మించి విక్రయించని వంకాయలు నేడు ఏకంగా రూ.80 పెరగడం విశేషం. కర్నూలు జిల్లాలో సెప్టెంబరు ఆఖరు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కూరగాయల పంటలు దెబ్బతినడంతో దిగుబడి పడిపోయింది. జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లలో కూరగాయల తోటల ధ్వంసమయ్యాయి. రోజు జిల్లావాసులకు సగటన 600 క్వింటాళ్ళ కూరగాయు అవసరం కాగా ప్రస్తుతం 300 క్వింటాళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. డిమాండ్ పెరగడంతోపాటు ఉత్పత్తి తగ్గడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత నెలలో టమోటా కిలో ధర రూ.10 ఉండగా నేడు రూ.40 లకు, పచ్చిమిర్చి రూ.25 నుంచి రూ.50కు చేరింది. క్యారెట్ రూ.35 నుంచి రూ.55, వంకాయ రూ.30 నుంచి రూ.80, ఆలుగడ్డ రూ.20 నుంచి రూ.40, గోరుచిక్కుడు రూ.30 నుంచి రూ.60, బెండ రూ.20 నుంచి రూ.40, ఉల్లిగడ్డ రూ.15 నుంచి రూ.30 చొప్పున ధరలు పెరిగాయి.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి**

వర్షాలకు పంటలు దెబ్బతినడంతో కూరగాయలను బెంగుళూరు, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు కూరగాయల వ్యాపారి హనుమంతరాయచౌదరి తెలిపారు. రవాణా ఖర్చు పెరగడంతో దరలు పెరిగాయన్నారు. జిల్లాలో కూరగాయలు కొద్దిరోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

# కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి భూసేకరణ

### ఎకరాకు రూ. 18 లక్షల జీవో 25 విడుదల

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడలో ఏర్పాటు చేయనున్న 7200 మెగావాట్ల అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూమికి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. జీవో 25 పేరిట ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్) తో సంప్రదింపులు తర్వాత ఎకరాకు రూ. 18లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జిరాయితీ డీ పట్టా భూములకు మాత్రమే ఇది వర్తిస్తుంది.రణస్థలం మండలంలో కొవ్వాడ దాని చుట్టపక్కల గ్రామాలైన రామచంద్రాపురం కోటపాలెం టెక్కలి జీరు కొవ్వాడ, గూడెంల ప్రజలకు చెందిన భూముల్లో ఇప్పటికే సర్వే నోటిఫై పూర్తియ్యాయి. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే సుమారు 2079 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఇక్కడ జిరాయితీ భూములు సుమారు 600 ఎకరాలు వున్నాయి. ఒక్కోటి 1208 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం ఆరు అణు రియాక్టర్లు ఇక్కడ నెలకొల్పనున్నారు. 2020 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని తొలుత లక్ష్యంగా నిర్ణయించగా అది మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిస్తున్నాయి.

### 8 శాతం వడ్డీరేటుకు

# ఆర్టీసీకి వెయ్యి కోట్ల రుణం

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీ)కి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.వెయ్యి కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఏడాదికి ఎనిమిది శాతం వడ్డీ రేటుతో ఈ దీర్ఘకాలక అప్పును పీఎన్‌బీ మంజూరు చేసింది. అయితే ఇందుకోసం ప్రభుత్వం గ్యారంటీగా సంతకం చేసింది. బయట అప్పులు తీర్చేందుకు ప్రభుత్వ గ్యారంటీతో రూ.1,500 కోట్ల అప్పు ఇప్పించాలని సంస్థ కోరగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.వెయ్యి కోట్ల రుణాన్నే మంజూరు చేసింది. ప్రభుత్వ గ్యారంటీతో అప్పు కోసం సంస్థ పలు బ్యాంక్‌ల చుట్టూ తిరగగా, పీఎన్‌బీ స్పందించి రుణాన్ని మంజూరు చేసింది. ఇప్పటికే పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆర్టీసీని సుమారు రూ.2,650 కోట్లకుపైగా అప్పులు ఉన్నాయి. వాటిల్లో అధిక వడ్డీ ఉన్న అప్పులూ ఉన్నాయి. పీఎన్‌బీ మంజూరు చేసిన రుణాన్ని అధిక వడ్డీ ఉన్న అప్పులను తీర్చేందుకు ఉపయోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రవాణా శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి అనీల్ చంద్ర పునేఠా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీని రూ.4,200 కోట్లకుపైగా నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు పలు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి పొందిన అప్పులు కూడా రూ.2,650 కోట్లకు పైగానే ఉన్నాయి. వీటిలో అధిక వడ్డీ చెల్లిస్తున్న అప్పులు కూడా ఉన్నాయి. అధిక వడ్డీల వల్ల ఏటా సంస్థపై రూ.46 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణం ఇప్పించాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) ఎం మాలకొండయ్య ఈ ఏడాది జూన్‌లోనూ, సెప్టెంబర్‌లోనూ ప్రభుత్వాన్ని కోరారు. రవాణాశాఖ ద్వారా పలుమార్లు బ్యాంకర్లతో సంప్రతింపులు చేసిన తర్వాతగానీ పీఎన్‌బీ రుణాన్ని ఇచ్చేందుకు ముందుకు రాలేదు.


# అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే

- అంచనా వ్యయం రూ.27,600 కోట్లు
- మారనున్న రాయలసీమ రూపు

**రాజధాని వార్తలు ప్రతినిధి, యస్.కె. ఇమ్రాన్, అమరావతి :** అమరావతిని అనంతపురానికి లింక్ కలుపుతూ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రహదారి నిర్మాణం కోసం ఇప్పటికే భూసేకరణ చేపట్టారు. ఈ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతపురం – అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పూర్తిగా కేంద్రం నిధులతో అత్యంత వేగంగా జరగనున్న ఇది రాష్ట్ర రహదారులకు తలమానికం కానున్నది.

**అత్యంత పొడవుగా మలుపులు లేకుండా**

అనంతపురం – అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే దేశంలోనే అత్యంత పొడవుగా, మలుపులు లేకుండా నిర్మించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రాయలసీమ సమగ్ర అభివృద్ధిలో ఈ హైవే కీలకం కానున్నది. ఇందుకు సంభందించిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించింది. 393.59 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి 27,600 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనాలు వేశారు. ఈ హైవేని నేషనల్ హైవేగా కేంద్రం గుర్తించింది.నిర్మాణ భాద్యతలను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థకు అప్పగించింది. 2019 నాటికి ఈ హైవేని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను కలుపుతూ నిర్మించే ఈ హైవేతో రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ముఖ్యంగా రాయలసీమకు ఈ రహదారితో బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, ప్రధాన నగరాలకు అనుసంధానం ఏర్పడనున్నది. రాయలసీమ నుంచి అమరావతి రాజధానికి ప్రయాణ సమయం, దూరం గణనీయంగా తగ్గనున్నది. కాగా గుంటూరు జిల్లాలో 82.4 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 226.9 కిలోమీటర్లు, కర్నూల్ జిల్లాలో 160.6 కిలోమీటర్లు, కడప జిల్లాలో 64.2 కిలోమీటర్లు, అనంతపురం జిల్లాలో 68.6 కిలోమీటర్లు హైవే నిర్మితం



కానున్నది. కర్నూల్ నుంచి ఒక లైన్ కడప నుంచి మరొక లైన్ వచ్చి ఈ రహదారిని కలవనున్నాయి. కర్నూల్ నుంచి నన్నూర్, భాగ్యనగర్ మీదుగా 75.60 కిలోమీటర్ల పొడవునా, కడప నుంచి కుమ్మర కొట్టలు, ఎదవల్లి మీదగా 88 కిలోమీటర్ల పొడవునా హైవేతో కలిసే విధంగా రెండురోడ్లు నిర్మించనున్నారు.

**తక్కువ ఖర్చుతో నిర్మించాలని...**

ఈ రహదారిని అత్యంత తక్కువ ఖర్చుతో నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భూసేకరణ విషయంలో మాత్రం భవిష్యత్ అవసరాలని దృష్టిలో పెట్టుకొని అధిక శాతం భూమిని సేకరిస్తోంది. ఎనిమిది వరుసలకు సరిపడే భూమిని సేకరిస్తున్నారు. మొత్తంగా కడప కర్నూల్ రహదార్లుని కలపుకొని ఈ హైవేని 598.830 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్నారు. అనంతపురం, అమరావతి రహదారి (393.59 కి.మీ) ఆరు వరుసలుగా,కడప, కర్నూలు రహదారులు నాలుగు వరుసలుగా నిర్మించాలని ప్రతిపాదించారు.. అవసరమైన చోట అక్కడక్కడ సొరంగ మార్గాలు, వంతెనలు నిర్మించే విధంగా మ్యాప్ రూపొందిస్తున్నారు. ఈ హైవేకి సమాంతరంగా రైల్వేట్రాక్ కూడా నిర్మించనున్నారు. ముఖ్యంగా భూసేకరణ విషయంలో తక్కువ మొత్తం చెల్లించాలని సర్కార్ భావిస్తోంది. ఈ రహదారికి ఇరువైపులా ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.

## అపర కుబేరుడిగా బిజోస్..!

### బిల్‌గేట్స్‌ను ఓడించిన అమెజాన్ వ్యవస్థాపకుడు



**న్యూయార్క్:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బిజోస్ నిలిచారు. ఇప్పటి వరకు అగ్ర స్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను వెనక్కినెట్టి బిజోస్ తొలిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. స్టాక్‌మార్కెట్‌లో అమెజాన్ షేర్లు 11.9శాతం పెరిగాయి. దీంతో ఆయన సంపద విలువ కూడా పెరిగింది. అమెజాన్ మూడో త్రైమాసిక ఫలితాలు గురువారం వెలువడటంతో.. శుక్రవారం ట్రేడింగ్‌లో ఆ సంస్థ షేర్లు అమాంతం పెరిగిపోయాయి. మరోవైపు నిన్న స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి మైక్రోసాఫ్ట్ షేర్లు కూడా ఏడు శాతం పెరిగాయి. ప్రస్తుతం బిజోస్ సంపద 90.6 బిలియన్ డాలర్లకు చేరగా.. బిల్‌గేట్స్ సంపద 90.1 బిలియన్ డాలర్లుగా ఉంది. బిజోస్ తొలి స్థానాన్ని కైవసం చేసుకోవడం ఇదేమీ కొత్తకాదు. జులై 27న అమెజాన్ షేర్లు రికార్డు స్థాయిలో పెరగడం వల్ల అత్యంత సంపన్నుడిగా నిలిచారు. కానీ అప్పట్లో కొద్ది గంటల వ్యవధిలోనే మళ్లీ బిల్‌గేట్స్ అగ్రస్థానాన్ని కైవశం చేసుకున్నారు.

# ఇళ్ల పేరుతో టోకరా


### విజయవాడలో ఘరానా మోసం

**రాజధాని వార్తలు ప్రతినిధి, - విజయవాడ :** తాను కార్పొరేషన్‌లో ఉన్నతాధికారినంటూ ఓ వ్యక్తి పేదలను నిలువునా ముంచేశాడు. నకిలీ పత్రాలపై కమిషనర్ సంతకాలు సైతం చేసి ఇళ్లు మంజూరైనట్లు నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ. 75 వేలు దండుకుని ముఖం చాటేశాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. జ్యోతిమహల్ వద్ద మెకానిక్‌గా పనిచేసే శివకుమార్‌కు గ్యారేజీ వద్ద తరచూ వస్తున్న ఆనంద్‌కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను విజయవాడ నగరపాలక సంస్థలో అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తానని అనంద్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు తన వాక్‌చాతుర్యంతో నమ్మించాడు. ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద రాజరాజేశ్వరీపేటలో నిర్మించిన ఇళ్లు పేదలకు వచ్చేలా చూస్తానని చెప్పాడు. ఇందుకోసం తనకు పెద్దగా ఇవ్వాల్సిన అవసరం లేదని ముందుగా రూ. 75 వేలు చెల్లించాలని సూచించాడు. తన భార్య కూడా ఓ ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తుందని, ఇద్దరం ప్రభుత్వ ఉద్యోగులమని చెప్పినట్లు సమాచారం. దీంతో శివకుమార్ తొలుత డబ్బులు ఇచ్చారు. ఈ క్రమంలో ఇళ్లు మంజూరైనట్లు వారందరికీ రూ. 100 స్టాంపు పేపర్లపై ఆనంద్‌కుమార్ కార్పొరేషన్ పేరుతో రాసి ఇచ్చాడు. కమిషనర్ ఇతర అధికారుల సంతకాలను సైతం చేశాడు. బాధితుల కుటుంబ సభ్యుల ఫోటోలను ఆ స్టాంపు పేపర్లపై అతికించి కార్పొరేషన్ స్టాంపులు కూడా వేశాడు. బాధితులు తమకు ఇళ్లు మంజూరయ్యాయని భావించారు. అయితే, ఇళ్ల వద్దకు మాత్రం తీసుకువెళ్లడం లేదు. గట్టిగా నిలదీయడంతో ఆనంద్‌కుమార్ ముఖం చాటేశాడు. దీంతో తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వారసత్వ వ్యాపారాలు

- మూడవస్థానంలో భారత్
- వారికే బిజినెస్‌లు

**న్యూఢిల్లీ :** కుటుంబ యాజమాన్యం కింద ఉన్న వ్యాపారాల్లో భారత్ ప్రపంచంలో మూడవస్థానంలో ఉంది. మన దేశంలోని 108 పబ్లిక్ లిస్టెడ్ కంపెనీలను కుటుంబాలు వంశపారపర్యంగా యాజమాన్యం వహిస్తున్నవే... ఈ క్రమంలో చైనా 167 కంపెనీలతో ప్రథమ స్థానంలో ఉండగా అమెరికా 121 కంపెనీలతో రెండవ స్థానంలో ఉందని క్రెడిట్ సూజీ నివేదిక వెల్లడించింది. క్రెడిట్ సూజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన 'సిఎస్ ఫ్యామిలీ 1000' పరిశోధనలో ఈ విషయం వెల్లడించింది. మార్కెట్ కాపిటలైజేషన్ 6.5 బిలియన్ డాలర్లతో భారత్ ఆసియా పసిఫిక్ దేశాల్లో జపాన్ మినహాయించి ఐదవ స్థానంలో నిలవగా ప్రపంచదేశాల్లో 22వ స్థానాన్ని ఆక్రమించింది. చైనా, అమెరికా, భారత్ తరువాతి స్థానాల్లో ఫ్రాన్స్(4), హాంగ్‌కాంగ్ (5), కొరియా (6), మలేషియా(7) థాయ్‌లాండ్(8), ఇండొనేషియా (9) మెక్సికో(10) వ స్థానాల్లో నిలిచాయి. సగటు పరిమాణం, ర్యాంకింగ్‌లో మార్పులు అభివృద్ధి చెందిన మార్కెట్లకు అనుగుణంగా మారినట్లు ఈ నివేదిక వెల్లడించింది. కుటుంబాల సొత్తయిన కంపెనీల సగటు మార్కెట్ క్యాపిటలైజేషన్ స్పెయిన్‌లో అత్యధికంగా (30) బిలియన్ డాలర్లు), నెదర్లాండ్స్ (30బిలియన్), జపాన్ (24 బిలియన్), స్విట్జర్లాండ్ (22 బిలియన్)గా నిలిచాయి. దాదాపు 1000 కుటుంబాలకు చెందిన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీలను ప్రాంతీయ, సెక్టార్, పరిణామ పరంగా పరిగణంలోకి తీసుకుని చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ముఖ్యంగా మన దేశంలో 60 శాతం వ్యాపార కుటుంబాల్లో ప్రస్తుతం మూడవతరం యాజమాన్యం క్రింద ఉన్నట్లు వెల్లడైంది. చైనాలో 30 శాతం మాత్రమే ఉన్నాయని క్రెడిట్ సూజీ వెల్లడించింది. కుటుంబ యాజమాన్యాల క్రింద ఉన్న వ్యాపారాల ఆర్థిక పరిస్థితి ఉన్నతంగా ఉన్నట్లు తెలుస్తోంది. కుటుంబపరంగా ఉన్న వ్యాపారులు దీర్ఘకాలిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తాయని వీరి నివేదికలో వెల్లడైంది. చైనా, భారత్, ఇండొనేషియాకు చెందిన కుటుంబాల




యాజమాన్యం కింద ఉన్న బిజినెస్‌లు అత్యంత ఖరీదైనవిగా నమోదయ్యాయి. మరోవైపు వారసత్వంగా ఉన్న బిజినెస్‌లు కాంపిటీషన్‌కు పోటీగా వారి ప్రణాళికలు విజయవంతంగా ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా భారత్, చైనా దేశాల్లోని కంపెనీలు క్రెడిట్ సూజీ దేశాల్లోని కంపెనీలు క్రెడిట్ సూజీ సర్వే ఆధారంగా 500మిలియన్‌డాలర్లను మించినట్లు వెల్లడైంది. వీరిలో ఐటి, ఫైనాన్షియల్, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా ఉన్నట్లు నమోదయ్యాయి. పర్యావరణం ఆధారంగా చైనా కన్నా భారత్ కొంచెంగా వెనకబడిఉంది. సామాజికా అంశాల ప్రాతిపదికంగా మన దేశంలోని 35శాతం కంపెనీలు 65 శాతం చైనా కంపెనీల ప్రాతిపదికలను అవలంభిస్తున్నాయి. సూజీ పరిశోధనలో ప్రధానంగా గమనించిందేమంటే పెట్టుబడిదారులు యాజమాన్యాన్ని ప్రాతిపదికగా తీసుకోకపోగా రోజువారీ జీవితంలో యాజమాన్యం వ్యాపారాలపై ఎంతవరకు దృష్టిపెడుతున్నారనే దానిపై ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది.

## కాలమ్

# ఎవరీ కంచ ఐలయ్య?

### వివాదాల చట్రంలోకి ఎలా వచ్చారు..?

**సామాజికవేత్త, ప్రొఫెసర్ కంచె ఐలయ్య రాసిన 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' పుస్తకం తెలుగు రాష్ట్రాల్లో వివాదానికి దారి తీసింది. ఆర్య వైశ్య సామాజిక వర్గం నుంచి ఈ పుస్తకం పై పెద్ద ఎత్తున నిరసన రావడంతో... దీనిపై చర్చ ప్రాధాన్యతను సంతరించుకుంది.**

**బహుజనవాదులు, వైశ్య మద్దతుదారులు స్పష్టంగా చీలిపోయి వాదోపవాదనలు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పుస్తకం శీర్షిక పైనే ప్రధాన అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వైశ్యులు.. దాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు.**

ఈ నేపథ్యంలో అసలు కంచ ఐలయ్య ఎవరు?, వివాదాల చట్రంలోకి ఆయన లాగబడ్డారా?.. అభిప్రాయాలకు స్వేచ్ఛ ఈ సమాజంలో కొరవడిందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ఐలయ్య నేపథ్యం

ఐలయ్య 1952, అక్టోబరు 5న వరంగల్ జిల్లాలోని పాపన్నపేట గ్రామంలో గొల్ల కురుమ కుటుంబంలో జన్మించారు. ఐలయ్య కుటుంబం గొర్రెల పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగించేది. చిన్నతనంలో విద్యాభ్యాసం అంతా అక్కడే కొనసాగింది. ఆ తర్వాత ఉన్నత విద్య కోసం ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు.

గౌతమబుద్ధుని రాజకీయ తత్త్వం అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్‌లో డాక్టరేటు పొందారు. ఆ తర్వాత అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేశారు. మౌలానా ఆజాద్ యూనివర్సిటీలోను ప్రొఫెసర్ గా పనిచేశారు. ప్రస్తుతం టీమాస్ మేదావుల ఫోరంలో సభ్యులుగా ఉన్నారు.

### ఐలయ్య రచనలు

ప్రొఫెసర్‌గా, రచయితగా దేశవ్యాప్తంగా పాపులర్ అయిన కంచ ఐలయ్య తొలి నుంచి బహుజనవాదాన్ని బలంగా భుజానికెత్తుకున్న వ్యక్తి. అంబేద్కర్, మార్క్స్ సిద్ధాంతాలను బలంగా విశ్వసిస్తూ తనవంతుగా వాటిని వ్యాప్తిలోకి తీసుకురావడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అనేక రచనలు చేశారు.

'నేనెట్ల హిందువునైత?'

ఐలయ్య రాసిన 'నేనెట్ల హిందువునైత?' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా పలు యూనివర్సిటీల్లోను పరిశోధనాత్మక పుస్తకంగా మారింది. దేశంలో ఉన్న చరిత్ర గ్రంథాలు, పురాణేతిహాసాలన్ని అగ్ర కులాల పక్షం వహించగా.. ఐలయ్య రాసిన పుస్తకాల్లో స్పష్టమైన బహుజన సాంస్కృతిక తాత్వికత కనిపిస్తుంది. హిందూమతానంతర భారతదేశం, దేవుడిపై బుద్ధుడి తిరుగుబాటు, అంటరాని దేవుడు వంటి పుస్తకాల్లో ఈ విషయాన్ని మనం గమనించవచ్చు. ఈ పుస్తకాలు సహజంగానే అగ్ర కులాల వైపు నుంచి తీవ్ర విమర్శను ఎదుర్కొన్నాయి.

తొలినాళ్లలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) తరుపున కూడా ఐలయ్య పనిచేశారు. 2007లో ప్రైవేటు సెక్టార్‌లో రిజర్వేషన్ల అంశంపై వీరప్ప మొయిలీ నేతృత్వంలో ప్రధాని మన్మోహన్ సింగ్ ఒక పర్యవేక్షణ కమిటీని వేశారు. ఆ కమిటీలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య కూడా ఒకరు. ఆ సమయంలో ప్రైవేటు వర్తక వాణిజ్యంలో ఎక్కువగా ఉన్నది వైశ్యులే కాబట్టి.. ప్రైవేటు సెక్టారులో రిజర్వేషన్లను వాళ్లు వ్యతిరేకించారని కంచ ఐలయ్య చెబుతున్నారు. తాజా పుస్తకం 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' పుస్తకంలోను ఈ విషయం ప్రస్ఫూటమైంది.

### శ్రమ శక్తికి దక్కని గౌరవం

ఉత్పత్తి కులాల శ్రమ పునాదిగా అగ్ర వర్ణాలు అభివృద్ధిలోకి రావడం, ఉత్పత్తిదారుడు మాత్రం పేదరికంలో, బతుకీడుస్తుండటాన్ని కంచ ఐలయ్య తన రచనల ద్వారా చాటుతున్నారు.

అనాదిగా ఈ దేశానికి సేవ చేస్తున్న అణగారిన కులాలే ఈ దేశానికి మొట్టమొదటి సైంటిస్టులు, ఇంజనీర్లు అని తన రచనల ద్వారా శాస్త్రీయంగా నిరూపించగలిగారు. ఈ క్రమంలోనే మాదిగ తత్వం, మాలల తత్వం, 'అజ్ఞాత ఇంజనీర్లు–కుమ్మరి, కమ్మరి, కంసాలి, గౌండ్ల', బహుజన స్త్రీవాదులు–చాకలోళ్లు, సామాజిక వైద్యులు–మంగలోళ్లు, ఆధ్యాత్మిక ఫాసిస్టులు–బ్రాహ్మణులు, సామాజిక స్మగ్లర్లు–కోమటోళ్లు వంటి పుస్తకాలను ఆయన వెలువరించారు.

ఈ దేశ శ్రమ జీవుల చరిత్ర, వారి నైపుణ్యాలు ఇక్కడి పాఠ్య పుస్తకాల్లో నమోదుకాకపోవడంపై ఆయనకు తీవ్రమైన అభ్యంతరాలున్నాయి. అసలైన శాస్త్రీయతను పక్కనపెట్టి, కేవలం భావవాద పూరితమైన కథలు, పద్యాలతో సమాజాన్ని పురోగతి చెందించలేమని ఆయన వాదిస్తున్నారు.

అలా తన రచనలు, ప్రసంగాల విషయంలో కంచ ఐలయ్య.. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ఆర్యవైశ్యుల నుంచి అదే వ్యతిరేకతను చవిచూస్తున్నారు. అయితే దళిత బహుజనులు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న అవమానాలు, ఛీత్కారాలు, మనుస్మృతి గ్రంథాల్లో వారి కించపరిచిన తీరు ఇక్కడ విస్మరణకు గురవుతుండటం సమాజంలోని వైరుధ్యాలను స్పష్టంగా ఎత్తి చూపుతోంది.


## మాక్స్‌క్యూర్ హాస్పటల్

అత్యాధునిక సదుపాయలతో 200 మంది
పిల్లల డాక్టర్ల హాస్పటల్ ఉంది...
ఇంక విషేశం ఏమిటంటే
ఇక్కడ అందించేది పూర్తిగా ఉచిత వైద్యం.
హైద్రరాబాద్ గచ్చిబౌలీలో ఎవరిని అడిగినా
మాక్స్‌క్యూర్ హాస్పటల్ అడ్రస్ చెబుతారు.
పుట్టిన పిల్లలు నుండి 80 సంవత్సరాల వరకు కార్డియో
నుంచి ఆర్థో వరకు ఏ వైద్యమైనా,
10 లక్షలు ఖర్చుయ్యే హార్ట్ సంబంధిత వ్యాధులైనా
ఉచితమే
సదుపాయాలన్నీ కార్పొరేట్ తరహాలో ఉంటాయి.
పేద,మద్యతరగతి వారు ఈ ఆసుపత్రి సౌకర్యాలను
ఉపయోగించుకోవచ్చు.

మాక్స్‌క్యూర్ ఫోను నెంబర్లు
**91004 33323, 99636 45001**

# ఈ చదువులు మాకొద్దు...!



ఇదివరలో మహరాజులు, జమిందారులు వారి సొంత డబ్బులు వెచ్చించి, అనేక పాఠశాలలు, కళాశాలలు కట్టించి విద్యాదానం చేశారు. విజయవాడలోని సీవీఆర్ పాఠశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, గుంటూరులోని జేకేసీ కళాశాల ఈ కోవలోకి వస్తాయి. బ్రిటీషువారి కాలంలో మరిన్ని కాన్వెంట్లు, కళాశాలలు ఏర్పడినా ప్రస్తుత కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల ధనదాహం లేదనేది ఖచ్చితంగా చెప్పగలం. మిషనరీ, లేదా వ్యక్తులు ఏర్పాటు చేసిన విద్యాలయాల్లో తప్పనిసరిగా ఆడుకునే మైదానం ఉండేది చదువుతోపాటు ఒత్తిడిని దూరం చేసే ఆటపాటలకు అక్కడ సమాన ప్రాతినిధ్యం లభించేది.ప్రస్తుత విద్యార్థులకు అవి మృగ్యం.

**పదిపాస్ కాగానే బెల్లం చుట్టూ ఈగల్లా కార్పొరేట్ సంస్థల వ్యక్తులు ఇంట్లో మూగుతారు.. మా కాలేజీలో ర్యాంకులు ఎక్కువంటే మా దానిలో ఎక్కువని తల్లిదండ్రులను పట్టి పీడిస్తారు. కల్లబొల్లి కబుర్లతో రెండేళ్లలో మీ పిల్లాడు ఐఐటీలో ఇంజనీరింగ్ చేస్తాడని ఊహల పల్లకీలో ఊరేగిస్తూ.. లక్షలు లాగేస్తారు..**

ఒక్కసారి కాలేజీలో చేరగానే పరిస్థితులు తారుమారవుతాయి. వాళ్లు బానిసలకన్నా దారుణంగా మారిపోతారు. తిన్నావాలేదా అని పట్టించుకునేవారు ఉండరు. కంటికి నిద్రకరువవుతుంది. ఈసడింపులు, గాంద్రిపులతో ప్రతిరోజు ఎలా గడుస్తుందా అని విద్యార్థులు భయం భయంగా బ్రతకాల్సి ఉంటుంది. క్షణం ఒక యుగంగా గడుస్తుంది. ఈ పరిస్థితులు తెలియని తల్లిదండ్రులు మొదట ఇంటికి వచ్చి తియ్యతియ్యని కబుర్లనే గుర్తు చేసుకుంటూ పిల్లలను ఎలా ఉన్నావు అని పలకరించడం మానేసి ..బాగా చదువుతున్నావా అంటారు... దీంతో వారు అడచెక్కలో పోకచెక్కలా నలిగి ప్రాణాలను సమిధలు చేసుకుంటున్నారు.

ఈ ప్రపంచంలో ఎక్కడా మూడేళ్లలో 60 మంది ఆత్మహత్యలకు పాల్పడిన విద్యాసంస్థలు లేవు. వేరే దేశాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే ఆయా కళాశాల యాజమాన్యాలకు ఏ 200 ఏళ్లో శిక్షలు విధించేవారు. అయితే మనది గాంధీ పుట్టిన దేశం కదా.. సహనశీలురం కావడంతో వారికి పదవులిచ్చి గౌరవిస్తున్నాం..

**తల్లిదండ్రుల్లో విచక్షణ, విజ్ఞత కొరవడినన్న రోజులు విద్యార్థుల మరణాలు ఆగవు. మధ్యతరగతి వర్గం తమ పిల్లలను చదువుల యంత్రాలుగా చూడటం మానుకోవాలి. వాళ్ల స్థితిగతులు పట్టించుకోవాలి. ఆనాడే విద్యావికాసం కలుగుతుంది.**

వాస్తవానికి ఈ కార్పొరేట్ విద్యాసంస్థలు వెలసినప్పటి నుంచి రాష్ట్రంలో విద్యావ్యవస్థ సర్వనాశనం అయింది. విద్యార్థులకు, విద్యాలయాలకు మధ్య వాణిజ్యబంధమే కాని, మరే ఇతర బంధాలు లేకుండా పోయాయి. వారిని యంత్రాల్లా మార్చడమే తప్ప వారిలోని జిజ్ఞాసను, అభిరుచులకు,అభిప్రాయాలకు ఏ మాత్రం విలువ లేకుండా చేశారు. విద్యలోని అసలైన వికాస స్ఫూర్తికి సమాధికట్టారు.

కార్పొరేట్ కాలేజీలు అగ్గిపెట్టెల్లా బలే విచిత్రంగా ఉంటాయి. దానిలో ఆటపాటలకు అసలు తావే ఉండదు. అవి విద్యా ఖార్కానాలన్నమాట..

ఇక్కడ చదువు చెప్పేవారికి పిల్లలను చదువు పట్ల ఆకర్షణ,చదువుపట్ల ఆకాంక్ష కలిగించే సుగుణాలేవీ ఉండవు. వారికి తెలిసింది ఒక్కటే అదేమంటే ఈసడించుకోవడం.. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు ఒకటే చదువు, విద్యార్థులకు అక్షరాలంటే అసహ్యం పుట్టేలా.. దీంతో విపరీత మానసిక నూన్యతకు గురై పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు. నిద్రకోసం మొహం వాచిపోవడం ఇక్కడ సదా మామూలు. చాలామంది పిల్లలు తమ భోజనాన్ని మానేసి ఆ కాసేపూ నిద్రకోసం కేటాయిస్తారు.

పిల్లలందరికీ ఒకే విధమైన ఫీజులు తీసుకుంటున్నా... చదివగలిగే వారిని మాత్రమే ఇంకాస్త రుద్ది మామూలు వాళ్లను గాలికి ఒదిలేస్తారు. లక్షల ఫీజులు కట్టే తల్లిదండ్రులు ఈ విషయంపై నిలేసిన దాఖలాలు లేవు. ఎందుకంటే ఒకసారి ఆ విద్యార్థి ఆ కాలేజీలో ప్రవేశించాక వారి హక్కులన్నీ హరించబడతాయి. వారికి ఎలాగోలా బయటపడితే చాలనే పరిస్థితి కల్పించబడుతుంది. తల్లిదండ్రులు, విద్యార్థులు త్రిశంకు స్వర్గంలో ఉంటారు. మరో విషయం ఏమంటే వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు మొదటి ర్యాంకులను సొంతం చేసుకునే అవకాశం ఉంటే వారిని అల్లరిమూకల మధ్యవేసి వారి చదువుకు కార్పొరేట్ కాలేజీల యాజమాన్యం గండికొడుతుందనే వాదం కూడా బలంగా ఉంది.

లక్షలు గుంజే హాస్టళ్ల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. పిల్లలను కోళ్లఫారంలోని కోళ్లమాదిరిగా కూరుతారు. గాలి వెలుతురు ఉండదు. ఎలుకలు, బొద్దింకలు సహజీవనం చేస్తాయి. కార్పొరేట్ కళాశాలలు వెలసి 25 ఏళ్లు కావస్తుండగా వాటి తాలుకా శ్లాబుపెచ్చులు కింద పడుతూ, ప్రాణభయం కలుగచేస్తుంటాయి. ఇంటర్మీడియట్ బోర్డుపై కార్పొరేట్ సంస్థలదే పెత్తనం..

**సృజనాత్మకత, వ్యక్తిత్వవికాసం లేని, బట్టీ చదువులు నాకొద్దు నాన్నా.. అమ్మా క్షమించు...**

ఇంటర్‌లో కార్పొరేట్ సంస్థలు వచ్చాకే తెలుగు రాష్ట్రాల పిల్లలు ఐఐటీల్లో చదువుతున్నారని వాటి యాజమాన్యాలు గప్పాలు కొట్టుకుంటారు కాని, వీరి మార్కులకు మేధస్సుకు సంబంధం లేదని, ఐఐటీ అధ్యాపకులు తలలు పట్టుకుంటున్న విషయం చెప్పరు. వీటి దెబ్బకు పిలానీ లాంటి సంస్థలు ప్రవేశపరీక్షలు నిర్వహించాల్సి వచ్చింది. మధ్యతరగతి తల్లిదండ్రుల కలలైన మెడిసిన్, ఇంజనీరింగ్ రెండు కాసులు రాల్చే కోర్సులనే కార్పొరేట్ సంస్థలు ఎంపిక చేసుకున్నారన్న విషయం మరవకూడదు. నారాయణ విద్యాసంస్థ నెల్లూరులో మొదట ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేది. ఆ తర్వాత క్రమంలో విద్యాసంస్థలను నెలకొల్పి, ప్రతి ఏడాది కోట్లను పోగుచేసుకుంటోంది.

**అలా ముందుకెళుతున్నారు..**

మంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన విద్యాసంస్థల్లో మరణాల రేటు కూడా పెరిగింది. దీంతో మరో మంత్రి విద్యాసంస్థల అధిపతి వియ్యంకుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆత్మహత్యలపై సీరియస్‌గా ఉన్నారని, ఇలాంటి కాలేజీలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారంటూ, కాలేజీ యాజమాన్యాలు తీరు మార్చుకోకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికైనా వెనకాడమంటూ (ఇన్ని మరణాలు సంభవించినా చర్యలు తీసుకోకుండా) జోక్ పేల్చారు. కాలేజీ విద్యార్థుల సమస్యలపై త్వరలో కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు 158 అనుమతిలేని హాస్టళ్లను గుర్తించారని, 2 నెలల్లో సంజాయిషీ ఇవ్వాలని వాటికి నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతులు లేని కాలేజీల్లో ఎక్కువ శాతం నారాయణ కాలేజీలు ఉన్నాయని స్పష్టం చేశారు. విద్యార్థుల చదువులు దృష్టిలో ఉంచుకొని వారికి కొంత కాలపరిమితి ఇచ్చినట్లు తెలిపారు.

ఈ మాటలు రాష్ట్రంలో ఏ ఒక్కరూ నమ్మరనేది సుస్పష్టం, విద్యార్థుల చెంపపై ఇటుకరాయితో దాడిచేసి కర్ణభేరి పగలడానికి కారణమైన,అందరి ముందు విద్యార్థులను చితకబాది వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి ఆత్మహత్యకు పురిగొల్పిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అనుమతి లేని హాస్టళ్లను రద్దుచేసి రూ. 40 వేల ట్యూషన్ ఫీజును ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 2,800 అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనికి ముందు ప్రభుత్వంలో పదవులు అనుభవిస్తున్న ఇద్దరు వియ్యంకులను మంత్రిపదవుల నుంచి తప్పిస్తేనే ముఖ్యమంత్రి మాటకు ప్రజలు విలువిస్తారని ప్రభుత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది.

మధ్యతరగతి కుటుంబాల్లో తల్లీదండ్రీ ఇద్దరూ ఉద్యోగాలు చేసి ఇంటికి చేరుకునే సరికి ఆలస్యమవడంతో పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత చదువుతున్నారా లేదా అనే విషయం పట్టించుకోవడం కష్టతరంగా మారింది. దీన్ని ఆసరాగా తీసుకున్న వ్యక్తులు ఇక్కడే చదివిస్తాం అన్న భరోసానిస్తూ విద్యావ్యాపారం చేస్తూ సామాన్యులపాలిట రక్తపింజేరులుగా మారారు. నిజానికి మారుతున్న కాలంతో ప్రభుత్వం కూడా మారి ప్రభుత్వ కళాశాలల్లోనే ఇలాంటి సౌకర్యం ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి దాపురించేదికాదు.. అయితే అధికారంలోకి వచ్చే పార్టీలు మారినా చర్యలు మారకపోవడంతో కార్పొరేట్ విద్యావ్యవస్థ విషవృక్షమై విద్యార్థులను బలితీసుకుంటోంది. ఇప్పటికైనా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు కళ్లు తెరచి ఈ విషవృక్షాన్ని కూకటి వేళ్లతో పెగల్చకపోతే సారీ అమ్మా..సారీ నాన్నా.. అనే చివరి ఉత్తరానికి సిద్ధంగా ఉండాల్సి వస్తుందని గుర్తించండి.

– ఖాన్



## 'అదిరింది' విడుదలకు లైన్ క్లియర్




విజయ్ ప్రధానపాత్రలో చేసిన మెర్సల్ ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్, మద్రాసు హైకోర్టు ఇష్టమైన వాళ్లు చూడండి, లేదంటే మానండి అంతే కాని సినిమాను రద్దు చేయాలంటూ కోర్టు విలువైన సమయాన్ని నష్టపరచవద్దు అంటూ తీర్పువెలువరించింది. దీంతో తెలుగు వెర్షన్ 'అదిరింది' విడుదలకు లైన్ క్లియర్ అయింది.

మెర్సల్ అంటే విరుచుకు పడటం, లేదా చావుదెబ్బ కొట్టడం అని అర్థం. ఈ సినిమాలో సింగపూర్‌లో 7 శాతం జీఎస్టీతో ఉచిత వైద్యం అందిస్తున్నారని, అత్యధిక పేదలు కల దేశంలో 28 శాతం జీఎస్టీ ఎందుకు విధించినట్లని హీరో విజయ్ డైలాగులు అధికార బీజేపీకి ఆగ్రహం కలిగించాయి. దీంతో ఈ సినిమాను నిషేధించాలంటూ కోర్టుమెట్లెక్కింది. అధికార పక్షానికి ఏది వ్యతిరేకంగా ఉన్నా విరుచుకుపడటం అవసరమనిపిస్తే అడ్డు తొలగించుకోవడం సర్వసామాన్యమైపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విషయంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్ హసన్, తమిళనటుడు నడిగర్ సంఘం ప్రధానకార్యదర్శి విశాల్ సంఘీభావం తెలపడం ముదావహం. ఈ సినిమాను ఆన్‌లైన్ చూశానన్న రాష్ట్ర బీజేపీనేత హెచ్‌డీ రాజా తెలపడాన్ని విశాల్ ఖండించడాన్ని జీర్ణించుకోలేని పెద్దలు జీఎస్టీ అధికారులను పంపి ఆయన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించడం కూడా అక్కడి ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. సినిమాలపై జీఎస్టీని 28 శాతం చేసినందుకు అక్కడి పరిశ్రమలోని వారంతా ఏకమై నిరసన గళం వినిపించడం ముదావహం. తమిళచిత్రపరిశ్రమ ప్రేక్షకులకు ప్రాధాన్యత నిస్తుంది. ప్రేక్షకులు కూడా హీరోలకు నీరాజనం పడతారు.


**తెలుగు హీరోలకు డబ్బులే ప్రధానం**

తెలుగు పరిశ్రమలో విపరీత డబ్బు కాంక్ష కనిపిస్తుంది. ఇక్కడి తెలుగు హీరోలు ప్రజల (ప్రేక్షకుల) కోసం కొంచెంకూడా ఆలోచించరు సరికదా సినిమా రిలీజు అవ్వగానే ఎక్కువ ధరకు టికెట్లు అమ్ముకుంటామని ప్రభుత్వాన్ని కోరుతుంటారు. ఇది తెలుగు ప్రేక్షకుల దౌర్భాగ్యం. షూటింగ్‌లో కాళీ దొరికినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర అధికార పక్షాలను ప్రసన్నం చేసుకుంటానికి ప్రయత్నిస్తారు తప్ప,ప్రజలకోసం ఒక్క క్షణంకూడా ఆలోచించరు... తెలుగు హీరోల డబ్బుయావపై ప్రేక్షకులు పునరాలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

## కోహ్లీ సంపాదన ఎంతంటే..!





అత్యంత సంపాదన పరులైన టాప్ టెన్ అథ్లెట్లలో ఒకరిగా నిలిచాడు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ. ఈ మేరకు ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో టాప్ టెన్ లో నిలిచిన ఏకైక క్రీడాకారుడిగా నిలిచాడితను. విరాట్ గత ఏడాదిలో ఏకంగా 14.5 మిలియన్ డాలర్ల సంపాదనతో ఏడో స్థానంలో నిలిచాడు. భారత ద్రవ్యమానంలో ఇది 93 కోట్ల రూపాయలకు సమానం. అథ్లెట్లలో టెన్నిస్ స్టార్ ఫెదరర్ 37.2 మిలియన్ డాలర్ల సంపాదనతో టాప్ పొజిషన్లో ఉన్నాడు. ఉసేన్ బోల్ట్ ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.



# కనకదుర్గమ్మ భక్తులకు భారం

రాజధాని వార్తలు ప్రతినిధి, యస్.కె. ఇమ్రాన్, విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకుంటే వరాలు దక్కుతాయని భావిస్తున్న భక్తులపై ఆదాయమే లక్ష్యంగా లడ్డూ ప్రసాదం ధరలు పెంచేశారు. విజయవాడ వన్‌టౌన్‌లోని మాడపాటి సత్రంలో జరిగిన దుర్గగుడి పాలక మండలి సమావేశంలో అధికారులు ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమ్మవారి దర్శన టికెట్ల ధరలు తగ్గిస్తారని అందరూ ఊహించిప్పటికీ లడ్డూ ప్రసాదం ధరలు సైతం పెంచడం సంచలనం సృష్టించింది. గతంలో 80 గ్రాములు బరువున్న దుర్గమ్మ లడ్డూ ప్రసాదం రూ.10లకు ఇచ్చేవారు. లడ్డూను 100 గ్రాములు చేసి ధర రూ. 10లకు ఇచ్చేవారు. లడ్డూను 100 గ్రాములు చేసి ధర రూ. 20కి పెంచాలని నిర్ణయించారు. శ్రీ చక్రార్చన లడ్డూ ప్రసాదం రూ.50 నుంచి రూ.100కు పెంచారు.



చక్కెర పొంగలి ధర కూడా రూ.20లుగా నిర్ణయించారు. తలనీలాల సమర్పణ టిక్కెట్ ధరను రూ.15 నుంచి రూ. 20లకు పెంచడం గమనార్హం. దీంతో సామాన్య భక్తులపై ఆర్థిక భారం తప్పదనే వ్యక్తమవుతోంది. భక్తులు నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందన్న విషయాన్ని కొందరు పాలక మండలి సభ్యులు చెప్పినప్పటికీ ఈవో పట్టించుకోలేదని సమాచారం. ధరల పెంపు విషయంలో వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది.

**కారులో వెళితే బాదుడే...**

దుర్గమ్మ దర్శనానికి ఘాట్ రోడ్డుపై కారులో వెళ్లేవారి నుంచి

- శ్రీ చక్రార్చన లడ్డూ రూ. 100
- కొండపైకి కారులో వెళితే రూ.50

రూ.50చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. మోటారుసైకిల్‌పై వచ్చేవారి నుంచి రూ.25 చొప్పున వసూలు చేస్తారు. లిఫ్టులో వచ్చేవారికి కూడా టిక్కెట్ ధర నిర్ణయించి డబ్బు వసూలు చేయాలని అధికారులు భావించినప్పటికీ పాలకమండలి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గినట్లు సమాచారం. దుర్గగుడి దత్తత ఆలయాల్లోనూ కొత్తగా ప్రత్యేక పూజలు ప్రవేశపెట్టంతోపాటు వాటికి టికెట్ల ధరలు నిర్ణయించారు. సీవీ రెడ్డి ఛారిటీ స్థలంలో నిర్మిస్తున్న డార్మెటరీని భక్తులకు కేటాయించాలని నిర్ణయించారు. దసరా పండుగ సందర్భంగా దుర్గగుడి ఉద్యోగులకు రూ.3 వేల చొప్పున బోనస్ చెల్లింపునకు అనుమతించారు. వీటితోపాటు ఘాట్ రోడ్డులో గ్రీనరీ, ఎల్ఈడీ లైటింగ్, ఇతర అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ధరల పెంపు నిర్ణయాన్ని ఈవో ఏకపక్షంగా అమలు చేస్తున్నారని కొందరు పాలక మండలి సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్లు తెలిసింది. సమావేశంలో ఆలయ ఈవో సూర్యకుమారి, పాలక మండలి చైర్మన్ యల మంచిలి గౌరంగబాబు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## దోచుకోడానికే జీఎస్టీ

### రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ : వస్తుసేవల పన్ను (జీఎస్టీ)పై ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ విమర్శలు సంధిస్తూనే ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన జీఎస్టీని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్‌గా పేర్కొన్నారు. ప్రజల ఆదాయాలను గౌరవంగా కొల్లగొట్టడమే జీఎస్టీ అని అన్నారు. గుజరాత్‌లో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా జీఎస్టీని "గబ్బర్ సింగ్ ట్యాక్స్"గా అభివర్ణించిన రాహుల్ కూడా దానిని గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో దాడిచేసేందుకు "షోలే" సినిమాలో అత్యంత ప్రచుర్యం పొందిన డైలాగ్‌ను ఉటకించారు. **"కాంగ్రెస్ జీఎస్టీ= నిజమైన సాధారణ పన్ను, మోడీజీకి చెందిన జీఎస్టీ= గబ్బర్ సింగ్ ట్యాక్స్= ఆదాయం నాకు ఇవ్వండి"** అని ట్విట్టర్‌లో రాహుల్ పేర్కొన్నారు. రమేష్ సిప్పీ దర్శకత్వంలో 1975లో విడుదలైన బాలివుడ్ బ్లాక్‌బాస్టర్‌లో ఒక బందిపోటు పేరు గబ్బర్‌సింగ్. ఈ పాత్రలో కీర్తి శేషులు అంజాద్ ఖాన్ నటించారు. గాంధీనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఈ పాత్రను ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. నూతన పన్ను వ్యవస్థను సరళతరం చేస్తూ మార్పు చేయాలని కోరారు."వారి జీఎస్టీ కాదు. జీఎస్టీ అంటే అర్థం గబ్బర్‌సింగ్ ట్యాక్స్. ఇది దేశానికి నష్టం చేస్తోంది. చిన్న దుకాణాల వారు వ్యాపారాన్ని మూసేసుకుంటున్నారు. లక్షలాది మంది యువకులు నిరుద్యోగులుగా మారారు. కానీ, ఇప్పటికీ వినేందుకు వారు సిద్ధంగా లేరు" అని రాహుల్ పేర్కొన్నారు.

## ఆరోగ్యం

### పచ్చిగా తిన్నా పర్లేదు



కూరలు, ఊరగాయలు, సలాడ్స్ వేటికైనా క్యాబేజ్ తిరుగులేని రుచే. పచ్చి క్యాబేజీ సన్నగా తరిగి సలాడ్ లో కలుపుకుంటే రుచి పోషకాలు రెండు లభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా రంగు రంగుల క్యాబేజీలు పండిస్తున్నారు. చూసేందుకు ముద్దుగా వుండే మీనియేచర్ క్యాబేజీలు కుడా వున్నాయి. ఫిటో న్యుట్రియంట్స్, యాంటి ఆక్సిడెంట్స్ పోషక విలువలు పుష్కలంగా వుండే క్యాబేజీలో కొవ్వు బాగా తక్కువే. బరువు తగ్గాలంటే ఇది సరైన ప్రత్యామ్నాయం గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా వుంటుంది. కనుక ఇది బ్లడ్ షుగర్ స్థాయిల్ని తగ్గిస్తుంది. విటమిన్ కె కి మంచి ఆదారం. అందానికి ఆరోగ్యానికి కుడా క్యాబేజీ ఉపయోగం.

### రిస్క్ తగ్గిస్తుంది




ఆహారంలో పీచు ఎంతగా వుంటే గుండె జబ్బుల రిస్క్ అంతగా తగ్గుతుంది అంటున్నారు ఎక్స్ పర్ట్స్. కార్బోహైడ్రేడ్స్ ధాన్యాలకు సంబంధించి వచ్చే అనేక వివాదాస్పద అంశాలతో ఎక్కువమంది వీటిని తినడం మానేస్తారు. అయితే వీటిలో వుండే పీచు గుండె జబ్బుల నుంచి రక్షించి ఆరోగ్యంగా ఉంచుతుంది. పూర్తి స్థాయి ధాన్యాలు, బంగాళదుంపల పై చర్మం తో సహా, పప్పులు,ఓట్స్, నట్స్ మొదలైన వాటిలో పీచు పుష్కలంగా వుంటుంది. బ్రౌన్ రైస్, బీన్స్, చెర్రీ పండ్లు, పచ్చని ఆకుకూరలు, కాయిధాన్యాలు వీటన్నింటిలో పీచు అధికంగా వుంటుంది.






Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com